**గణిత శాస్త్రానికి, నాకు పగ మెరిత అని ప్రభుత్వ ఆస్పత్రిలో రుజువయింది.**

గణిత శాస్త్రం అంటూ ఒక పెద్ద పేరు తగిలించడం ఎందుకు కాని, నాకు లెక్కలు రావు. ఉదాహరణకు—

మూడు + మూడు = సున్న (O) అని నేనంటాను. లెక్కల పండితులు ఏమంటారో తెలియదు.

మూడు నంబరు బెడ్డులోని నా అప్ప చెల్లెలు ఇహలోకం విడిచిన తరవాత దాదాపు పది నిమిషాలు నా లోకం శూన్యమైంది.

ఇంతకూ అది ఆస్పత్రి. అందునా ప్రభుత్వ ఆస్పత్రి. జీవన్మరణాలు క్షణాలలో తేలిపోయే ఎ.ఎమ్.సి. వార్డు.

శూన్యానికి స్థానం ఎక్కడ ఉంటుంది? పదినిమిషాలు పూర్తికాకుండానే ముగ్గురు వార్డులోకి ప్రవేశించారు. ఇద్దరు పురుషులు, ఒక స్త్రీ.

పురుషులలో ఒకరు రోగి. రెండవ వాడు అతడి "లంగోటి యార్" అని తరవాత తెలుసుకొన్నాను. మూడవ వ్యక్తి ఖాజీ సాక్షిగా రోగిని వివాహమాడిన స్త్రీ.

రోగిలో విశేషాలు చాలానే ఉన్నాయి. ముఖ్యమైనవి మాత్రం మననం చేసుకొంటూ మనవి చేస్తాను. మిత్రుని ఆసరా ఉన్నా తూలుతూ ఉన్నా తనంతట తానుగా బెడ్డు చేరుకొన్నాడు. అడ్డంగా పడ్డాడు. మిత్రుడు, భార్య అతణ్ణి సరిగా పడుకోబెట్టడానికి కొంత ప్రయత్నం చేశారు. కొంత మట్టుకు విజయం సాధించారు. మిత్రుడు రోగి నోటిమీద వేలుపెట్టి, "ఖామూష్" అని హెచ్చరించాడు. అప్పుడు రోగి కళ్ళు తెరిచాడు క్షణమాత్రం. అవి చింతనిప్పులు. నావైపు క్షణంలో సగం మాత్రం తీక్షణంగా చూశాయి.

నాతో మొదలుపెట్టి, ఆ అగ్నిగోళాలు ఎ. ఎమ్. సి. వార్డు అంతా దహించివేస్తాయేమోనని నేను భయపడిన మాట నిజం.

# ఆస్పత్రి కథలు

# మూడు + మూడు = సున్న (0)

## తూలికా భూషణ్



రెండవ ప్రపంచ యుద్ధ కాలం.

హిట్లర్ రష్యా మీద విరుచుకు పడ్డాడు. "సెకండ్ ఫ్రంట్" ప్రారంభించి, సహాయపడమని రష్యా మిత్ర దేశాలను కోరుతూంది. మిత్రదేశాలకు అలాంటి తలంపు లేదు.

రష్యాను హిట్లర్ అంతంచేసే వరకు వేచివుండడం, ఆ తరవాత హిట్లర్‌ను ఓడించడం, మిత్రదేశాల వ్యూహం. ఒక్కదెబ్బకు రెండు పిట్టలు. జర్మనీ, రష్యా రెండూ మిత్ర దేశాలకు శత్రు దేశాలే. కాని, మిత్ర దేశాల ఎత్తు ఫలించలేదు. రష్యా దెబ్బకు హిట్లర్ సైన్యాలు తిరోగమించాయి. బెర్లిన్ రష్యా చేత చిక్కడం రోజుల్లో వుంది. అయితే ఎలాగో ఒకలాగు జర్మనీ రాజధాని నగరం బెర్లిన్‌లో కాలుమోపాలని మిత్ర దేశాలు నిశ్చయించాయి.

అప్పటికే కాలహరణం చాలా అయ్యింది. అయినా అమెరికా సేనాధిపతి జనరల్ పాటన్ దానిని సాధించగల ఘనుడు. సాధించమని నేతలు ఆదేశించారు. పాటన్ సాధించాడు. అదొక ఘనమైన జైత్రయాత్ర.

అయితే ఆ యాత్రలో అనేకులు ప్రాణాలు కోల్పోయారు. పలువురు భయపడి "సిక్ రిపోర్ట్"తో పారిపోతున్నారు. పిరికితనం ఏవగించుకొనే జనరల్ పాటన్ ఆస్పత్రులు తనిఖీ చేశాడు. ఒక ఆస్పత్రిలో ఒక అధికారి వరండాలో నడుస్తూవుంటే చూసి, పట్టరాని కోపంతో అతణ్ణి కొట్టాడు పాటన్.

దురదృష్టం ఏమంటే ఆ దెబ్బతిన్న అధికారి నిజంగా జబ్బుపడి వున్నాడు. పైన ఒక జనరల్ క్రింది అధికారిని కొట్టడం క్షమించరాని నేరం. ఆ సమయంలో, అంటే బెర్లిన్‌లో కాలు మోపేవరకు పాటన్ అవసరం. అందుచేత పాటన్ బహిరంగంగా క్షమార్పణ చెప్పుకొంటే ఆ నేరం క్షమిస్తామని నేతలు రాజీ పద్ధతి సూచించారు. మిత్ర దేశాల లక్ష్యసిద్ధి ఆశించి పాటన్ అందుకు ఒడంబడ్డాడు. ఇది చరిత్ర.

—రచయిత

నాలో భయంతోబాటు ఒక అనుమానం కూడా చోటుచేసుకొంది- రోగి చెడతాగి ఆ స్థితిలో వున్నాడని.

అర్థ శతాబ్దం క్రిందట నన్ను పెళ్ళి చేసుకొన్న నేరానికి నాకు సేవచేస్తూ ఇంకా నావల్ల ప్రేమ మిగుల్చుకొన్న నా సతీమణి నా కుడిచేతిపక్క. ఆ రోగికి. నాకు మధ్య వుంది. ఆమెను కాపాడుకోవడం నాకు మంచిది. తాగిన తిమ్మిరిలో రోగి అనే ఆ దుష్టుడు ఏమైనా అసభ్యంగా ప్రవర్తిస్తే ఏం చేయను? అందుచేత ఆవిణ్ణి నా ఎడమ పక్కకు రమ్మని సౌంజ్ఞచేశాను.

అదృష్టం! ఆ రోగి తాగలేదు. మన లోకంలో లేదని మరికొంత సేపటిలో తేలిపోయింది. నా అప్ప చెల్లెలు నిష్క్రమణం ఒక హెచ్చరికలా పని చేసింది కాబోలు. పది పదిహేను నిమిషాలలో వైద్యులు ఆ రోగి తాలూకు నోరు,నాలుక, కళ్ళు, కాళ్ళు, కడుపు, రక్తం పాటు, రక్తంపోటు, ఊపిరితిత్తులు, గుండెకాయ, తల అన్నీ పరీక్షించారు.

నరంలోకి, నరం వెలుపలికి సూదులు గుచ్చి మందులు ఎక్కించారు. చిత్రం ఏమంటే ఆ తరవాత మరునాడు అపరాహ్ణం ఒక గంట వరకు అతడి సంగతి పట్టించుకొన్నవారు లేరు.

నేనూ తృప్తిచెందాను. ధైర్యం కూడ గట్టుకొన్నాను.

అతను అసభ్యంగా ప్రవర్తించడంమాట ఎలా వున్నా అసలు మన లోకంలో వుంటే కదా? అప్రయత్నంగా అప్పుడప్పుడు లేస్తున్నాడు. బాత్‌రూమ్‌వైపు పరిగెత్తుతున్నాడు. భార్య నీడలా వెన్నంటి కాపాడుకొంటున్నది. అడపాదడపా రోగికి వాంతులు అవుతున్నాయి.భార్య వాటిని ఎత్తి అవతల పోసి, శుభ్రంచేసి, మళ్ళీ మంచం మీద పడుకోబెడుతున్నది. అంతా మౌనంగా చేస్తున్నది! రోగులందరికీ అలాంటి భార్యలు వుంటే ప్రపంచ జనాభా పెరుగుదల అరికట్టడం ప్రభుత్వ ఆస్పత్రుల తరం కాదు.

(ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వాహకులారా ఏకంకండు!!)

ఆ రోగి విషయంలో నాకు ధైర్యం ఎందుకంటే ప్రమాదం గడిచిపోయిందని కాబోలు ఎ.ఎమ్.సి. వైద్యులు నిశ్చింతగా ఉన్నారు.

రెండు అంటే నేను.


మూడుఅంటే మూడు పదులైనా నిండని ఆ బెడ్డునెంబరు మూడు రోగి. అతడికి నాకు కేవలం ఆ మూడు పదుల వత్సరాలే తేడా. నాకు అరవై దాటింది.

మూడు మిత్రుడు ఆ మరునాడు అపరాహ్ణం ఒంటిగంటకు ముందుగా వచ్చాడు. రోగి భార్యకు టీ. బిస్కట్లు ఇప్పించడానికి బయటికి తీసుకొని వెళ్ళాడు.

అంతే.

ప్రళయం ముంచుకువచ్చింది. తత్కాలంగా ఎ. ఎం. సి. కి అధిపత్యం చలాయించడానికి ఒక వైద్యుడు వచ్చాడు. నల్లనివాడు, మిత్తికి సూచకంగా నల్లని దుస్తులు ధరించినవాడు. పొట్టివాడు. గట్టివాడు. రోషకషాయిత నేత్రుడు. ఎ.ఎం.సి.ని బాధించడానికే ఈ లోకంలోని మనుషులు కంకణం కట్టుకొన్నవారనే దృఢమైన నమ్మకంకలవాడు.పలువురు జబ్బులనటించి, రోగాల ముసుగులు ధరించి, ప్రభుత్వాన్ని ప్రభుత్వ సేవకులను మోసం చేస్తున్నారనే అభిప్రాయాన్ని నరనరానా జీర్ణించుకొన్న పురుషోత్తముడు. వేరొకరి అభిప్రాయాలకు గడ్డిపరక పాటి విలువ అయినా ఇచ్చే అలవాటు లేని పోటు మానిసి.ధీరుడు.విజ్ఞానఖని.

ఆ మాటకు ఎల్లోపతీలో అయినా, ఇతర వైద్య విధానాలలో అయినా వున్న సౌకర్యమే అది. ఎవరి అభిప్రాయం వారిది. ఒకరి అభిప్రాయానికి మరొకరు విలువ ఇవ్వడం మాట అటుంచి పట్టించుకొనవలసిన అవసరం ఏమీ లేదు. అందుకే వైద్యాన్ని కూడా జ్యోతిష, సాముద్రిక, సంఖ్యా శాస్త్రాలతోబాటు "ఎంపిరికల్ సైన్సు"గాపరిగణిస్తే బాగావుంటుందేమో?



ఏమైనా ఆ కొత్త అధికారి ప్రవేశానికి సరిగా ముందు మూడు సహజ ధోరణిలో బాత్‌రూమ్‌వైపు వెళ్ళినట్లు వున్నాడు.మూడు ఖాళీగా వుంది. రోషకషాయిత నేత్రుడు. ప్రళయకాల ఝంఝామారుతం మాదిరి మూడు మీద దాడిచేశాడు.

"మూడు ఎక్కడ?" అని అడిగాడు. ఎవరికీ తెలియదు. "మూడు తాలూకు" అన్నాడు. పెరుమాళ్ళ కెరుక.

అంతే.

మొదటే ఎ. ఎమ్. సి. ఖాళీచేసే దృఢ నిశ్చయంతో వచ్చిన ఆ అధికారి మూడు "కేస్‌షీట్" తెప్పించాడు. ఎమ్.ఎమ్. 2 కి మార్చుతూ సంతకం పెట్టాడు.

బడిపంతులు మాదిరిగా "నెక్స్ట్", "నెక్స్ట్" అంటూంటే చూపు నామీద పడింది.

రెండంగలలో నా మీద పడ్డాడు. 'ఎలా ఉందన్నాడు.

'ఫరవా లేదన్నాను.విన్నాడో లేదో నాకు తెలియదు.

నా ప్రాణవాయువు ఆపుచేయమన్నాడు. నా నరంలోకి అంతవరకు ఎక్కించినది చాలునని తీర్మానించాడు. ఆ సెలైన్ బాపతు పరికరాలన్నీ పీకించేశాడు.

ఎమ్. ఎమ్.2 నాకూగతి అని నిర్ణయించి బెడ్ ఖాళీ చేయించాడు.

ఇక చెప్పవచ్చేదేముంది? పది నిమిషాల తేడాతో ఎమ్.ఎమ్. 2లో మూడు స్థానంలో మూడు చేరింది. రెండు అంటే నేను 10లో చేరాను.

మూడు భార్య నన్ను చూసి పలకరింపుగా, విషాదంగా నవ్వింది. నవ్వడం మినహా నేను చేయగలది మాత్రం ఏముంది? చరిత్ర పునరావృత్తం అవుతూంది. ఒక వార్డు నించి మరొక వార్డుకు మధ్యాహ్నం వెళ్ళినవారికి బెడ్డు ఇవ్వడం తప్పించి మరి ఏ విధమైన స్వాగత సత్కారాలు లభించవు.

మరునాడు ఆ వార్డు అధికారి వచ్చి పరీక్షించి "ఇలా చేయండి" దని ఆజ్ఞాపించే వరకు చికిత్స జరగదు. మందులు మాకులు ఇవ్వడం అసలే వుండదు.

మరునాడు ఎమ్. ఎమ్. అధికారి వచ్చాడు. మూడును పరీక్షించాడు. 'కోమా' అన్నాడు. 'బ్రతికే అవకాశం లేదన్నాడు. మళ్ళీ ఎ. ఎమ్. సి. కి పంపించేశాడు. ఆ తరవాత మూడుగంటలకు కాబోలు.— మూడు + మూడు = సున్న (0) అని వైద్యులు తీర్పు చెప్పడంతో కథ పూర్తి అయింది. అంటే మూడు ఇహలోకం విడిచాడు. ఎక్కడికి వెళ్ళాడో ఆయాకే తెలియదు. ●